



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

పోస్టింగ్ ఇచ్చారు..జీతం మరిచారు

- రెండో ఎంఇఒలకు అందని జీతాలు - నాలుగు నెలలుగా అదే పరిస్థితి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రెండో ఎంఇఒలను ఆర్భాటంగా ప్రభుత్వం నియమించింది. కానీ వారికి జీతాలు ఇవ్వడం మాత్రం పూర్తిగా మరిచారు. గడిచిన నాలుగునెలలుగా జీతాలందక ఎంఇఒ-2 ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

విద్యావ్యవస్థ మార్పులో భాగంగా ప్రతీమండలానికి రెండో ఎంఇఒను ప్రభుత్వం నియమించింది. మండలాల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఈ పోస్టుల్లో నియమించింది. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఇఒలకు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించగా, నియమించిన ఎంఇఒ-2లకు అకాడమిక్ బాధ్యతలు అప్పగించారు. స్కూళ్లకు సంబంధించి అకాడమిక్ మోనటరింగ్, ఉపాధ్యాయులకు శిక్షణాతరగతులు వంటి పనులను రెండో ఎంఇఒలు చూస్తున్నారు. ఇక్కడ వరకూ భాగానే ఉంది. పోస్టులో చేరిన వీరికి ఇప్పటి వరకూ ప్రభుత్వం జీతాలివ్వలేదు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మండలానికి ఒకరు చొప్పున రెండో ఎంఇఒలు పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 19వ తేదీన వీరంతా బాధ్యతలు చేపట్టారు. దాదాపు నాలుగు నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ జీతాలు అనేవి ఇవ్వలేదు. వీరంతా సీనియర్ ప్రధానోపాధ్యాయులే. నెలకు రూ.లక్ష, ఆపైన వరకూ జీతాలు అందుకుంటున్న వారే. నాలుగు నెలలుగా జీతాలందకపోవడంతో ఒక్కొక్కరికి దాదాపు రూ.నాలుగు లక్షలపైనే జీతం పెండింగ్‌లో ఉంది. ఈ జీతాలపై ఆధారపడి జీవించే కుటుంబాలకు నాలుగు నెలలుగా జీతాలు లేకపోతే పరిస్థితి ఏమిటో వేరే చెప్పనక్కర్లేదు. ఒకటి, రెండు నెలలు అయితే ఏదోరకంగా సర్దుకుంటారు. ఏకంగా నాలుగు నెలలుగా జీతాల్లేకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తమకు వచ్చే జీతాల ఆధారంగా నెలవారీ ఖర్చులు, ఇఎంఐలు వంటివి ఏర్పాటు చేసుకుంటారు. నాలుగు నెలలుగా వేతనాలందకపోవడంతో ఖర్చులు సర్దుబాటు చేసుకోవడం కష్టతరంగా మారింది. కుటుంబ అవసరాలకోసం సైతం అప్పుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నెలలోనైనా జీతాలు ఇస్తారా అనేది ఇంకా స్పష్టత లేదు. డిఇఒ కార్యాలయంలో పనిచేసే ఎడిలకు డిడిఒ బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో చాలా మండలాలకు రెగ్యులర్ ఎంఇఒలు లేరు. వేరే మండలాల్లో పనిచేస్తున్న ఎంఇఒలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు తమమండలంతో పాటు వేరే మండలంలోని బాధ్యతలు నిర్వహించడం కష్టంగా మారింది. రెగ్యులర్ ఎంఇఒలు లేని మండలాల్లో రెండో ఎంఇఒగా నియమితులైన ఉద్యోగులకు పనిభారం సైతం ఎక్కువగానే ఉంటుంది. అకాడమిక్‌కు సంబంధించిన ఇబ్బందుల పరిష్కారంలో ఎంఇఒ-2 ఉద్యోగులు పనితీరు భాగానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ ఎంఇఒ-2 ఉద్యోగులకు నాలుగునెలలుగా జీతాలు ఇవ్వకపోవడం మాత్రం విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ నెలలో కూడా జీతాలు అందకపోతే ఉద్యోగులు ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది.



త్వరలోనే జీతాలు విడుదల

మండల విద్యాశాఖ అధికారి 2 వేతనాలను త్వరలోనే విడుదల అవుతాయి. వీరి వేతనాలకు సంబంధించి డి ఈ ఓ కార్యాలయం ద్వారానే బిల్లులు చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ట్రెజరీకి కూడా బిల్లులు పంపడం జరిగింది.

- డిఇఒ వెంకట రంగారెడ్డి



జీతాలు చెల్లింపులో అలసత్వం తగదు

ఉద్యోగుల, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల అలసత్వం వహిస్తుంది. ఈనెల ఉపాధ్యాయుల జీతాలను చాలా ఆలస్యం చేశారు. ఇంకా ఇప్పటికి ఎంఈఓ-2లకు జీతాలు విడుదల కాలేదు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలి.

- జయరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

సిఎం పర్యటనకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 19న ఎమ్మిగనూరుకు రానున్న సందర్భంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, జెసి నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వీరశైవ లింగాయిత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్, కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బివై.రామయ్య హాజరయ్యారు. వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, బిఆర్.బసిరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య, సిఐలు మధుసూదన్ రావు, మోహన్ రెడ్డి, తహశీల్దార్ ఆంజనేయులు, కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, ఎంపిపి గొల్ల కేశన్న, టౌన్ బ్యాంకు ఛైర్మన్ కొమ్ము రాజశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యత

- నియోజకవర్గానికి ఐదు రోడ్లు మంజూరు

- ప్రజాశక్తితో ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఆర్.నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చే విధంగా కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేస్తానని రోడ్లు, భవనాల శాఖ ఎస్ఇ ఆర్.నాగరాజు తెలిపారు. నియోజకవర్గానికి ఐదు హై ప్రియారిటీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రయాణం, రవాణా సక్రమంగా జరగాలంటే రోడ్లు ప్రాధాన్యత సంతరించుకుంటాయని చెప్పారు. ప్రభుత్వ కార్యకలాపాలు సక్రమంగా జరగాలంటే ప్రభుత్వ కార్యాలయ భవనాలు మంచిగా ఉండాలని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ఉభయ జిల్లాల్లో 2022-23 సంవత్సరానికి కొత్త పనులు ఎన్ని వచ్చాయి..?

ఎస్ఇ : 2022-23 సంవత్సరానికి ఉభయ జిల్లాల్లో ప్రైమరీ హెల్త్ సెంటర్లు 13 భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. (నంద్యాలకు 4, కర్నూలుకు 9). అలాగే రూ.50 లక్షలతో ఐదు బ్లాక్ పబ్లిక్ యూనిట్లు వచ్చాయి.

భవనాల మరమ్మతులకు ఏమైనా నిధులు వచ్చాయా..?

ఎస్ఇ : కర్నూలులో కలెక్టరేట్ భవనం మరమ్మతుల కోసం రూ.8 కోట్లు మంజూరయ్యాయి. పనులు జరుగుతున్నాయి.

హై ప్రియారిటీ రోడ్లకు ఎన్ని నిధులు మంజూరయ్యాయి..?

ఎస్ఇ : హై ప్రియారిటీ రోడ్లు నియోజకవర్గానికి 5 రోడ్ల చొప్పున 25 ప్యాకేజెస్‌కు దాదాపు రూ.70 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, మున్సిపాలిటీల్లో ఉంటాయి. ఇందులో ప్రధానంగా పాణ్యానికి మూడు, కోడుమూరు రెండు, నందికొట్కూరు రెండు, మంత్రాలయం మూడు, నంద్యాల రెండు, ఎమ్మిగనూరు ఒకటి, ఆదోని మూడు, శ్రీశైలం ఒకటి, పత్తికొండ మూడు, ఆలూరు ఒకటి, ఆళ్లగడ్డ రెండు, బనగానపల్లె ఒకటి, డోన్ ఒకటి ఉన్నాయి.

కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా కలెక్టరేట్ నిర్మాణానికి భవనం ఏమైనా మంజూరయిందా..?

ఎస్ఇ : నంద్యాల కలెక్టరేట్ నిర్మాణం కోసం వ్యవసాయ పరిశోధన కేంద్రానికి సంబంధించిన పది ఎకరాల స్థలం సర్వేలో ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయితే భవన నిర్మాణం చేపడతాం.

పుష్కరాలకు సంబంధించి మిగిలి ఉన్న నిధులతో ఏమైనా రోడ్లు వేస్తున్నారా..?

ఎస్ఇ : రేమట, ఉల్చాల రోడ్లు పూర్తిగా పాడవడంతో పుష్కరాలకు సంబంధించిన మిగిలి ఉన్న నిధులతో రేమటకు రూ.రెండు కోట్లు, ఉల్చాలకు రూ.నాలుగు కోట్ల కేటాయించి పనులు ప్రారంభించాం.

కర్నూలులో వక్కెర బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. నిర్మాణానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా..?

ఎస్ఇ : వక్కెరవాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.8 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం.

గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు చర్యలు ఏమైనా తీసుకున్నారా..?

ఎస్ఇ : గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల రోడ్లు దెబ్బ తిన్న విషయం వాస్తవమే. ఎక్కడ ఎక్కువ అవసరమో అక్కడ ప్రాధాన్యతను బట్టి రోడ్లను నిధులు రాగానే వేయడం జరుగుతుంది.

చేసే పనుల్లో నాణ్యత లేకుంటే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : పనుల్లో నాణ్యత లేకుంటే క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ విజయవాడ వారు వచ్చి రోడ్లను పరిశీలిస్తారు. రోడ్లలో నాణ్యత లేకుంటే రికవరీ పెడతారు. బిల్లులు ఆపేయడం జరుగుతుంది.



వెంకట్రామిరెడ్డి జీవితం

యువతరానికి స్ఫూర్తిదాయకం

- వి.కృష్ణయ్య, తెలకపల్లిరవి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వెంకట్రామిరెడ్డి జీవితం విద్యార్థులకు, యువతరానికి స్ఫూర్తిదాయకమని, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోనీ కెకె.భవన్లో వెంకట్రామిరెడ్డి సంస్మరణ సభ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షత వహించారు. అథితులు వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి కష్ణయ్య , ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు తెలకపల్లిరవి, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి డాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ జిల్లా కార్యదర్శి ధనుంజయ, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి , వెంకట్రామిరెడ్డి తమ్ముని కుమారుడు శేషాద్రి రెడ్డి మాట్లాడారు. వెంకట్రామిరెడ్డి విద్యార్థులకు, యువతరానికి స్ఫూర్తిదాయకం ఆయన లెక్చరర్‌గా పనిచేస్తూనే 1970వ సంవత్సరం డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపక సమావేశంలో కర్నూలు జిల్లా నుండి పాల్గొన్న విద్యార్థి ప్రతినిధుల బృందానికి నాయకత్వం వహించారన్నారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్లులో జన్మించిన కె. వెంకట్రామిరెడ్డి విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారన్నారు. నిరంతరం అధ్యయనమే ఊపిరిగా భావించి తన ఇంటిని పుస్తకాల నిలయంగా మార్చుకున్నారని చెప్పారు. ఒక అంశం పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని పట్టుదలతో వాటి గురించి తెలుసుకోవడానికి ఎంతగానో ఆసక్తి చూపేవారని చెప్పారు. తన దగ్గరికి వచ్చిన కార్యకర్తలకు ,నాయకులకు వెంకట్రామిరెడ్డి చెప్పే మాటలు వినసొంపుగా ఉండేవచ్చారు. వారికి ఒక అంశం పట్ల విద్యార్థులకు అర్థమయ్యే రకంగా తెలియజేయడం, పేరుకు లెక్చరర్ గా పని చేస్తూ ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించేవారని అన్నారు. లెక్చరర్ గా పనిచేస్తూనే జిల్లాలో సిపిఎం ఉద్యమాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. చివరి శ్వాస విడిచే వరకు సిపిఎం అభిమానిగా, శ్రేయోభిలాషిగా జీవించారని వివరించారు. చివరి వరకు మార్క్సిస్టు ఐడియాలజీతో మార్క్సిజం పై అచంచల విశ్వాసంతో ఉన్నారని అన్నారు. ఆయన మరణం కర్నూలు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రగతిశీల భావజాల ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఆయన ఆశయాల కోసం ఇప్పుడున్న యువతరం అతను కలలు కన్న ఆశలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, జిల్లా నాయకులు అంజి, అమర్‌బాబు , మల్లేష్ ,నగర నాయకులు యోగి , ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నరసింహ, గౌస్ దేశాయ్, వెంకటస్వామి ,లక్ష్మన్న , కుమార్ , నాగేష్ , రఘు బాబు , ఎల్లాగౌడు , మధు , ప్రజా సంఘాల నాయకులు శేషయ్య, గురు శేఖర్, రాధాకృష్ణ, రామకృష్ణ, శిరీష, రంగస్వామి రాఘవేంద్ర పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

కర్నూలుకు చేరుకున్న మహిళా జవాన్లు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా మహిళా సాధికారతకు, కన్యాకుమారి నుంచి గుజరాత్ వరకు 150 మంది మహిళా జవాన్లు (సిఆర్‌పిఎఫ్) 75 బైక్ ల పై ర్యాలీగా బయలుదేరి ఆదివారం కర్నూలుకు చేరుకుంది. ఈ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధి బృందానికి ఐసిడిఎస్ పిడి వెంకటలక్ష్మి ఇతరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్తు సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో పిడి వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సాగుతున్న బైక్ ర్యాలీకి మహిళలు మద్దతు తెలిపారన్నారు. మహిళా సాధికారత ద్వారానే సమాజం అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు , డిసిపిఒ శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

19 నుంచి ఇంటర్ విద్యార్థులకు దసరా సెలవులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 19 నుండి 26వ తేదీ వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు దసరా సెలవులు ఉంటాయని ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని యాజమాన్య ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించాలని కోరారు.



దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు గడ్డవీధి జమ్మిచెట్టు ప్రాంగణంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తామని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గడ్డవీధిలోని జమ్మి చెట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవాంతరాలు ప్రజలకు ఎదురవకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు నగరూరు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సుజాత, హకీం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సలీమ్ శంకర్ కబ్జాభూముల్లో మట్టి తవ్వాక ఏర్పడిన గోతులు

అసైన్డ్ భూమిలో భారీగా ఎర్రమట్టి తవ్వకాలు

సలీమ్ శంకర్ దందా చేపట్టినట్లు సమాచారం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని సలీమ్ శంకర్ ఆక్రమించుకున్న అసైన్డ్ భూమిలో ఏళ్లుగా భూపోరాటం చేస్తున్నా పట్టించుకోని అధికారుల అసమర్థతకు తోడు భారీగా ఎర్రమట్టి తవ్వకాలు జరిగాయి. ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేపట్టగా భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇక్కడే సలీమ్ శంకర్ ఎర్రమట్టి దందా చేపట్టినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సలీమ్ శంకర్ అన్యాక్రాంతమైన భూములకు సమీపంలో గ్రీన్‌కో కంపెనీ పవన విద్యుత్ గాలి మరలను ఏర్పాట్లు చేస్తోంది. అందుకు భారీ వాహనాల్లో తీసుకెళ్లే సామాగ్రి కోసం రోడ్లు వేసేందుకు ఇక్కడ ఒప్పందం చేసుకొని సొమ్ములు చేసుకొన్నట్లు సమాచారం. ప్రధానంగా కొండలైన, అసైన్ భూమిలో నైనా, మట్టి అవసరమైతే మైనింగ్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అలా కాకుండా అడిగేవారు లేరని సలీమ్ శంకర్ భూ ఆక్రమణలు, అంతటితో ఆగకుండా ఎర్రమట్టి దందాలు యథేచ్చగా చేపట్టడంపై అధికారులకు, పోలీసులకు కూడా మామూళ్లు భారీగా ముడుతున్నట్లు మండలంలో సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

సంకెళ్లతో టిడిపి నాయకుల నిరసన



టిడిపి కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను నిరసితూ ఆదివారం కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి టిజి.భరత్, నగర పార్టీ అధ్యక్షులు డి.నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తులిపారు. టిడిపి ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వర్‌రావు యాదవ్ పాల్గొన్నారు. చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చెసి 37 రోజులు అవుతుందన్నారు. పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం ఇందిరమ్మ కట్టవద్ద మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేతులకు సంకెళ్ల కట్టుకుని నిరసన తెలిపారు.

న్యాయానికి సంకెళ్లు

పత్తికొండ: చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన , న్యాయం చేసిన వారికి న్యాయానికి సంకెళ్లు వేశారని పత్తికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేఇ. శ్యాంబాబు పేర్కొన్నారు. పత్తికొండ పట్టణంలో నాలుగు స్తంభాల కూడలి దగ్గర టిడిపి నాయకులతో కలిసి కెఇ శ్యాంబాబు చేతులకు సంకెళ్ల వేసుకొని నిరసన తెలిపారు

చట్టాన్ని చుట్టంగా చేసి న్యాయానికి సంకెళ్లు : టిడిపి

కర్నూలు క్రైమ్ : వైసిపిప్రభుత్వం న్యాయానికి సంకెళ్లు వేసిందని కోడుమూరు నియోజకవర్గ టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో న్యాయానికి సంకెళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులు కార్యకర్తలు చేతులకు సంకెళ్లను ధరించి టిడిపి జిల్లా సీనియర్ నాయకులు డి విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో నిరసనను తెలిపారు.



బొగ్గుల దస్తగిరి నాయకత్వంలో సంకెళ్లు కట్టుకుని నిరసన



గౌరుచిత నేతృత్వంలో టిడిపి నిరసన

చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ చెరువులో నిరసన

తుగ్గలి : నాయుడు అరెస్టును నిరసిస్తూ పత్తికొండ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఇ. శ్యాంబాబు ఆదేశాల మేరకు తుగ్గలి మండలం బొందిమడుగుల చెరువులో టిడిపి నాయకులు వినూత్నంగా చెరువులో జలదీక్ష, నిరసన వ్యక్తం చేశారు. మాజీ జడ్పి ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, సీనియర్ నాయకులు కొత్తూరు శివరాముడు మాట్లాడారు.

ఎపిజె అబ్దుల్ కలాం జీవితం దేశ సేవకు అంకితం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిజె అబ్దుల్ కలాం జీవితం దేశ సేవకు అంకితం చేశారని ఎస్‌డిపిఐ నగర అధ్యక్షుడు అశ్వక్ హుస్సేన్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలో ఎస్‌డిపిఐ పార్టీ కార్యాలయంలో ఎస్‌డిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎపిజె అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. నగర అధ్యక్షుడు అశ్వక్ హుస్సేన్ మాట్లాడుతూ భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం 1931 అక్టోబర్ 15న రామేశ్వరం తమిళనాడులో జన్మించారన్నారు. ఆయన రామేశ్వరం తమిళనాడులోనే ఫిజిక్స్, ఎరోస్పేస్ ఇంజనీరింగ్‌లో చదువు పూర్తి చేశారన్నారు. ఆ తర్వాత దేశంలో చాలా సేవలందించారన్నారు. భారతీయ డిఫెన్స్ విభాగవ ఇస్రోలో , న్యూక్లియర్ విపన్ తయారీలో అదేవిధంగా మిలటరీలో కూడా తన సేవలను అందించారు. తన జీవితంలో చివరి శ్వాస వరకు కూడా భారతదేశానికి చదువు భవిష్యత్తు యువతరానికి సేవలందిస్తూ అందరిని దేశం కోసం సేవలు అందించాలని లెక్చర్స్ ఇస్తూ తన జీవితాన్ని దేశం కోసం అర్పించారు. తన ఆఖరి శ్వాసలో కూడా విద్యార్థులతో మాట్లాడుతూ కుప్పకూలారని తెలిపారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎస్‌డిపిఐ నాయకులు

ఎపిజె అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత దశకు చేర్చుకోవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయం సహాయ గ్రంథపాలకురాలు వి. పెద్దక్క సూచించారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాలల విద్యార్థులకు దసరా పండుగ సెలవుల్లో విజ్ఞాన శిబిరాలలో భాగంగా రిటైర్డ్ హెడ్మాస్టర్ అయిన హుస్సేన్ పీరా , డిప్యూటీ లైబ్రేరియన్ వి పెద్దక్క , అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి , కేజీ గంగాధర రెడ్డి కలిసి నీతి కథలు ,చెప్పుతూ ఆధ్యాత్మిక కథలు, చరిత్ర గల పుస్తకాలు చదివిస్తూ ఇంగ్లీష్‌లో ఎలా రాణించాలనే అనేక విషయాలను తెలిపారు. గ్రంథాలయం గురించి వివరిస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ రాష్ట్రపతి కీర్తిశేషులు అబ్దుల్ కలామ్ జయంతి సభలో పాల్గొన్నారు. ముందుగా అతిథులు అందరూ అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల వేసి వారిని స్మరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఐజి సెంథిల్‌కుమార్

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ రాత పరీక్షలు

8,521 మంది అభ్యర్థులకు 8,392 మంది హాజరు

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డిఐజి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలులోని 14 పరీక్ష కేంద్రాలలో 2 రోజుల పాటు ఈనెల 14,15 తేదీలలో జరిగిన ఎస్ ఐ మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, కడప జిల్లా ఎస్పి సిద్దార్థ్ కౌశల్ , నంద్యాల జిల్లా ఎస్పి కె. రఘువీర్ రెడ్డి లు కర్నూలు కేంద్రంలోని ఈ క్రింది 14 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ పరీక్ష కేంద్రాలలో పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష జరుగుతున్న తీరును, పకడ్బందీ ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును పరిశీలించారు. మొత్తం 8,521 మంది అభ్యర్థులకు గాను పురుష అభ్యర్థులు 7,644 , మహిళా అభ్యర్థులు 859 అభ్యర్థులు హాజరయ్యారు. 129 మంది గైర్హాజరయ్యారు. అందులో 111 మంది పురుష, 18 మంది మహిళా అభ్యర్థులు గైర్హాజరయ్యాన్నారు.

క్రికెట్ బెట్టింగు రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి -కోడుమూరు



కోడుమూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం 3గంటలకు ఊరి బయట వల్లెలాంబ గుడి దగ్గర క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఎనిమిది మంది యువకులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కోడుమూరుకు చెందిన శ్రీవల్ల వీర గుజరాతీ ఎ. ఈరన్న, చింత వీరేష్, బోయ విజయ్, పాలవారి భాస్కర్ రెడ్డి, ఎం.వేణుగోపాల్, బోయ రామకృష్ణ, గొల్ల రవి, బోయ రంగన్న ఈ ఎనిమిది మంది క్రికెట్ వరల్డ్ కప్పు జరుగుతున్నందున మొబైల్ ఫోన్ల నందు క్రికెట్ చూస్తూ, బాల్ టుబాల్, మ్యాచ్‌టు మ్యాచ్ బెట్టింగ్ ఆడుతూ మెసేజ్‌లు, బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఈ రోజు జరుగుతున్న ఇంగ్లాండ్-అఫ్ఘానిస్తాన్ మ్యాచ్ చూస్తూ బెట్టింగ్ ఆడుతుండగా , నిన్న జరిగిన ఇండియా- పాకిస్తాన్ మ్యాచ్ కు పెట్టిన డబ్బులను ఇచ్చిపుచ్చుకుంటూ ఉండగా వారిని పట్టుకుని వారి సెల్ ఫోన్‌లో ఉన్న మెసేజ్‌ల ద్వారా, బెట్టింగ్ ఆప్‌లా ద్వారా ఆడిన క్రికెట్ బెట్టింగ్ మేరకు పై ఎనిమిది మంది అరెస్టు చేసి, వారి వద్ద నుండి మొత్తం రూ.1,52,000, 08 మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ వారిపై నిఘా పెట్టిన పోలీస్ సిబ్బంది జగదీష్ కేదర్, రామకృష్ణ, రాముడు లను అభినందించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరులో పర్యటించనున్న సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ కోసం ఆదోని బైపాస్ రోడ్డు పక్కన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణతో పాటు వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎస్పీ జి.కృష్ణకాంత్, జెసి నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మండలంలో 'జగనన్న చేదోడు' 4వ విడతకు సంబంధించి నగదు జమ చేయనున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి వచ్చే దారిలో గుంతలు లేకుండా ప్యాచ్ వర్క్, స్పీడ్ బ్రేకర్స్ తొలగించడంతో పాటు సభా ప్రాంగణంలో బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి సభా వేదికకు వచ్చే దారిలో బస్సుకు ఇబ్బంది లేకుండా ఎలక్ట్రిక్ వైర్లను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. డీఎస్పీ సీతారామయ్య, తహశీల్దార్ ఆంజనేయులు, కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా బన్నీ ఉత్సవాలు...

- సిఐ ఆధ్వర్యంలో రింగ్‌కర్రలు స్వాధీనం

ప్రజాశక్తి - హొళగుంద


రింగ్ కర్రలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం అరికెర గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించి, రింగ్ కర్రలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలసిన శ్రీమాల మల్లేశ్వరరావు బన్నీ ఉత్సవాలను (కర్రెల సమరాన్ని) ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకొని పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆకన మాట్లాడారు. ప్రతేడాది విజయదశమి నాడు మాల మల్లేశ్వర కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు కర్రలతో పాల్గొనడం ప్రమాదకరమన్నారు. కాగడాలు, కర్రెల వల్ల చాలామంది భక్తులు గాయాల పాలైన సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. అలా జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం వల్ల అనర్థాలు జరుగుతాయని తెలిపారు. ఒకరినొకరు కొట్టుకోకుండా ఉత్సవం ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని కోరారు.

చంద్రబాబును విడుదల చేయాలి

- 'న్యాయానికి సంకెళ్లు'తో టిడిపి నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎలాంటి ఆధారాలు లేకున్నా చంద్రబాబును అరెస్టు చేసి న్యాయానికి సంకెళ్లు వేయడం దుర్మార్గమని, బాబును త్వరగా విడుదల చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం టిడిపి శ్రేణులు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన శ్రీమఠం ప్రధాన ఆర్చి వద్ద 'సిఎం డౌన్.. డౌన్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టు రాజకీయ కుట్ర అని తెలిపారు. చంద్రబాబును 36 రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచడం బాధాకరమన్నారు. టిడిపి మండల నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, చావిడి వెంకటేష్, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, హండే హనుమంతు, వట్టేప్ప గారి నరసింహులు, నాగేష్, ఏబు, రాఘన్న, మేకల నరసింహులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

మళ్లీ తాత్కాలికమేనా..?

- ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులపై అనుమానాలు

ప్రజాశక్తి - ఆదోని

వేసవికాలం ముంచుకొస్తోంది. పురవాసుల నీటి వినియోగం పెరుగుతోంది. అవసరానికి తగిన నీరు అందుబాటులో లేదు. ఆదోని పురవాసులకు నీటి అవసరాలు ఏ విధంగా తీరుస్తారో అధికారులే స్పష్టత ఇవ్వాలి. ఆదోని పట్టణ వాసుల దాహార్తిని తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సైడ్ బండ్ కుంగిపోయి రెండు నెలలు గడిచింది. ట్యాంకులో 3110 మిల్లీలీటర్ల కెపాసిటీ ఉంది. నీటి ట్యాంకు ప్రస్తుతం వెలవెలబోతోంది. ఇందులో నీరు నింపాలంటే కనీసం 45 రోజుల సమయం పడుతుందని అప్పట్లో అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్ఎల్‌సికి నీటి ప్రవాహం ఉంది. నవంబరు 15 వరకు నీరు వదులుతారని సమాచారం. అక్కడ నీరు బంద్ చేస్తే ఆదోని వాసులకు నీటి కష్టాలు తప్పవా అన్నది ఆందోళన కలిగిస్తున్న విషయం.

మళ్లీ తాత్కాలిక పనులే..!

బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సైడ్ వాల్ సుమారు 105 మీటర్లు కుంగిపోయింది. గతంలో రెండు సార్లు సైడ్ వాల్ మరమ్మతులు చేపట్టారు. ఇందుకుగాను సుమారు రూ.కోటి ఖర్చు అయ్యాయని అప్పట్లో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. మరమ్మతులు చేపట్టి నెలలు గడవక ముందే మళ్లీ వాల్ కుంగిపోయింది. ఈసారైనా శాశ్వత ప్రాతిపదికన పనులు చేస్తారని అందరూ భావించారు. అధికారులు మాత్రం తాత్కాలిక పనులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఇటీవల అత్యవసర మున్సిపల్ కౌన్సిలర్ ఏర్పాటు చేసి సుమారు రూ.55 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తీర్మానం చేయించారు. ట్యాంకు బండ్‌కు సపోర్టుగా ఇసుక సంచులు పేర్చి సోమవారం నుంచి కాలువ నుంచి ట్యాంకులోకి ఆరు మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తామని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో కాకుండా 80 శాతమైనా నీటిని నింపి వేసవి గట్టెక్కేలా చర్యలు తిసుకుంటున్నామని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ తెలిపారు. అమృత్ ఫేస్ టు కింద మంజూరైన రూ.22 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనుమతి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని, అక్కడి నుంచి అనుమతి రాగానే నీటి నిల్వకు ఆటంకం కలుగకుండానే పనులు చేయిస్తామని చెబుతున్నారు. నీటి ఎద్దడి రాకుండా అధికారులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని పురవాసులు కోరుతున్నారు.


బండ్‌కు సపోర్టుగా పేర్చిన ఇసుక సంచులు

ఎలాంటి భయాందోళన వద్దు

- రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్



ఆదోని పురవాసులకు తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు చేపట్టాం. నీటి ఎద్దడి గురించి ఎలాంటి ఆందోళనా అవసరం లేదు. రాంజల చెరువులోని నీటిని శ్యాంపిల్‌గా సేకరించి ల్యాబ్‌కు పంపాం. అక్కడి నుంచి అనుమతి రాగానే కొన్ని ఏరియాలకు ఆ నీటిని సరఫరా చేయిస్తాం. బసాపురం ట్యాంకులో కొద్దిపాటి నీటిని నింపి వేసవికి సరిపోయేలా చూస్తాం. ప్రస్తుతం తాత్కాలికంగానే పనులు చేయిస్తున్నాం. త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

మరో ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి



పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న ట్యాంకు నీరు సరిపోవడం లేదు. శివారు ప్రాంతాల్లో వారానికోసారి నీటిని ఇస్తున్న పరిస్థితి. నీరు పుష్కలంగా సరఫరా కావాలంటే మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలి. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, అధికారులు మేల్కొని ఇప్పట్లోనే మరో ట్యాంకుకు ప్రతిపాదన పంపితే ప్రజలకు ఇబ్బంది ఉండదు. నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతాం. నీటి ఎద్దడి ఏర్పడితే కౌన్సిల్, అధికారులదే బాధ్యత.

బాబును జైలులోనే చంపుతారేమోనని భయం

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన చంద్రబాబును జైలులోనే చంపుతారేమోనని భయంగా ఉందని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక భూ రమణ కల్యాణ మండపంలో కెఇ.శ్యాంబాబుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఒక వైపు జైలులో ఉన్న చంద్రబాబుకు సరైన సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి, జైలు అధికారులకు లేదని పేర్కొన్నారు. టిడిపి నాయకులు భువనేశ్వరి, లోకేష్‌లు చంద్రబాబును కలిసి పరిస్థితిని చూసి ఆవేదన వ్యక్తం చేస్తూ సమాచారం అందించారని చెప్పారు. ప్రతిపక్ష నేతపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, చంద్రబాబుకు ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లాల నాయకుల ఆధ్వర్యంలో ఎస్‌టిబిసి కళాశాల మైదానం నుంచి శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు బాబూరావు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని మాధవరం గ్రామంలోని సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తిక్కారెడ్డికి, నాయకులకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సానుభూతి పరులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి అడివప్ప గౌడ్, టిడిపి యువ నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, చావిడి వెంకటేష్, మీడియా ఇన్‌ఛార్జీ విజయ రామిరెడ్డి, కోసిగి నాయకులు జ్ఞానేష్, తెలుగు యువత మండల అధ్యక్షులు సాయికుమార్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు, సాల్మన్ రాజు పాల్గొన్నారు.


మాధవరం చర్చిలో తిక్కారెడ్డిని, నాయకులను సన్మానిస్తున్న నాయకులు

దెబ్బతిన్న చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి

- ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆలూరు

ఆస్పరి మండలం చిన్నహోతూరు చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు డిమాండ్ చేశారు. ఆదివారం దెబ్బతిన్న చెరువు కట్టను చిన్నహోతూరు, ముసానహళ్లి, చిగిలి గ్రామ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్నహోతూరు చెరువు కింద సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందేవని, చెరువులో నీటి నిల్వతో భూగర్భజలాలు పెరిగి బోరులకు పుష్కలంగా నీరు అందేవని తెలిపారు. ఐదేళ్ల క్రితం వచ్చిన వర్షాలకు కట్ట ఒక్కసారి తెగిపోవడంతో నీరు వృథాగా పోయి పొలాలు, ముసానహళ్లి గ్రామాల్లోకి చేరి నష్టం కలిగించిందని చెప్పారు. అప్పటి నుంచి కట్టకు మరమ్మతులు చేయకపోగా వర్షపు నీరు చెరువు నుంచి వృథాగా వాగుల ద్వారా నాగనాథనహళ్లి చెరువులోకి చేరుతోందని తెలిపారు. గతేడాది చిన్నహోతూరు, నాగనాథనహళ్లి చెరువు నీరు అధికమై నారాయణపురం పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. చిన్నహోతూరు చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరందాలంటే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న కట్టను మరమ్మతులు చేపట్టాలని కోరారు. రైతుసంఘం ఆలూరు మండల కార్యదర్శి యు.ఈరన్న, చిన్నహోతూరు మాజీ సర్పంచి రామాంజనేయులు, సిఐటియు నాయకులు విఠల్, రైతులు సిద్ధరాముడు, తిమ్మప్ప, వెంకటేశులు, సోమన్న, నాగరాజు, సోమశేఖర్ పాల్గొన్నారు.


చెరువు కట్టను పరిశీలిస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

పీఠాధిపతిని విమర్శించడం మంచిది కాదు

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయి

ప్రజాశక్తి - నందవరం



మంత్రాలయం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను విమర్శించడం మంచిది కాదని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రాలయం అభివృద్ధిలో శ్రీసుభుదేంద్రతీర్థులు కృషికి నిదర్శనమని, మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వస్తుంటారని తెలిపారు. మఠం నిబంధనలకు అనుగుణంగా ప్రముఖులకు మాత్రమే గర్భగుడి దర్శనం ఉంటుందని, ఈ నిబంధనలకు భక్తులమైన అందరం సహకరించాలని కోరారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలులో ఉంచిన తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. ఆయన ఆరోగ్యంతో తిరిగి రావాలని టిడిపి కార్యకర్తలు రాఘవేంద్రస్వామికి పూజలు చేయడం శుభ పరిణామమని చెప్పారు. మఠం నియమాలకు అనుకూలంగా పూజలు చేయడం మన కర్తవ్యమన్నారు.

ఆరోగ్యంతోనే శక్తిమంతమైన వ్యవస్థ నిర్మాణం

- ఆర్యవైశ్య సంఘం మాజీ

ప్రజాశక్తి - ఆదోని

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడం వల్ల సమాజంలో శక్తిమంతమైన వ్యవస్థ నిర్మాణం జరుగుతుందని ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు, ఎన్ఆర్ఐ నగేష్ కాకుబాళ్, ఇన్‌కంటాక్స్ విశ్రాంత అధికారి సిఆర్.స్వామి తెలిపారు. ఆదివారం ఆదోని రిక్రియేషన్‌లో క్లబ్ శ్రీఅశ్వత్థ నారాయణ దేవాలయం కళాభారత్ సేవా సమితి ఆధ్వర్యంలో దసరా పండగ సందర్భంగా కరాటే, యోగా, బాక్సింగ్, వెపన్స్, కర్ర సాము వంటి అంశాలపై ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువుతోపాటు క్రీడలను బాల్యం నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఆటలు ఆడడం వల్ల శరీరం దృఢంగా ఉండి మానసికంగా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా దృక్పథం కలిగిన వారు ముందుకొస్తే తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. పిల్లలకు విద్యతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. కళాభారత్ సేవా సమితి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు. బాక్సింగ్‌కు సంబంధించిన క్రీడా పరికరాలను అందజేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గుడికల్ కుమారస్వామి, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు తలారి ఆంజనేయులు, ఈరన్న, కొండ స్వయంభూ నరసింహ స్వామి ఆలయ ధర్మకర్త ప్రతాప్ స్వామి, కేశవ మాస్టర్, శివకుమార్, చందు, మహేష్ పాల్గొన్నారు.


క్రీడల వెపన్స్ అందజేస్తున్న నాయకులు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ప్రజాశక్తి - కౌతాళం



అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటన కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని బాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లమ్మకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చివరి కుమార్తె మాల లక్ష్మి (21) కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని బాపురం శివమోహన్ రెడ్డి నీటికుంటలో ఆదివారం మృతదేహమై కనిపించింది. అగసలదిన్నె గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మాల నాగన్న అనే యువకుడు వేధింపులకు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెళ్లి చేసుకోవాలని గత మూడు నెలల నుంచి లక్ష్మిని వేధింపులకు గురి చేసేవాడని పేర్కొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బిల్డింగ్ కార్మికులకు పింఛను ఇవ్వాలి : సిఐటియు

ఎమ్మిగనూరు : 50 ఏళ్లు నిండిన బిల్డింగ్ కార్మికులకు పింఛను ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం డి.ఉస్మాన్ వలీ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా డి.ఉస్మాన్ వలీ, కో కన్వీనర్లుగా బి.గోవిందు, బి.తిమ్మప్ప, కమిటీ సభ్యులుగా ఎస్.అలీ బాష, బి.రామాంజనేయులు, షేక్షావలీ, రంగన్న, కైసర్, వీరేష్, మాదన్న, రామన్నను ఎన్నుకున్నారు.

ఘనంగా కలాం జయంతి

ఆదోని : మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం ఆదోని కమిటీ సభ్యులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదోనిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అబ్దుల్ కలాం విగ్రహ ప్రతిష్టాపన విషయాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సభ్యులు అబు బాకర్ సిద్ధిక్, రాపూఫ్, హుస్సేన్, సద్దాం, అర్షద్, యాసిన్, మోనా, ఖాసీం, నూర్, అక్బర్, హైదర్, అల్తాఫ్ తెలిపారు.

పీఠాధిపతులపై ఆరోపణలు తగదు

- వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, మాజీ సర్పంచి కృష్ణస్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులుపై టిడిపి నాయకులు ఆరోపణలు చేయడం తగదని వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వైసిపి నాయకులు కె.మల్లికార్జున, మాజీ సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి హితవు పలికారు. ఆదివారం స్థానిక ప్రయివేట్ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో పీఠాధిపతులను వైసిపి ఏజెంట్‌గా అభివర్ణించడం సరికాదన్నారు. శ్రీమఠం అభివృద్ధిలో పీఠాధిపతుల కృషి మరువలేనిదని తెలిపారు. గతంలో టిడిపి నాయకులు ఎన్నో సార్లు గర్భగుడి దర్శనం చేసుకున్న విషయం మరిచారా అని ప్రశ్నించారు. పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూడాలని సూచించారు. గతంలో లోకేష్ వచ్చినప్పుడు, సోమిశెట్టి, ఎమ్మెల్సీ వచ్చినప్పుడు ఎన్ని సార్లు దర్శనాలు చేసుకోలేదని ప్రశ్నించారు. మరోసారి పీఠాధిపతుల గురించి మాట్లాడితే గ్రామస్తులు ఏకమై తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ వికెసి రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, నాయకులు శివ కుమార్, జిమ్మి, శంకర్, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, భాస్కర్, రాము, వీరారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

- మంచాలమ్మకు విశేష పూజలు నిర్వహించిన పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆదివారం స్థానిక శ్రీమఠంలో దీపాంతులను వెలిగించి దసరా నవరాత్రులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గ్రామ దేవత మంచాలమ్మకు పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. **ఆస్పరి** మండలంలోని శంకరబండ గ్రామ సమీపంలోని రామతీర్థం కుండపై కొలువైన శ్రీవేదమాత గాయత్రి దేవి, ఆస్పరిలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఆలయాల్లో శరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. గాయత్రీ దేవి ఆలయంలో వేద పండితులు అనిల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కుంకుమార్చన, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి రోజు భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సూరయ్య, పవన్, సుధాకర్, కౌశిక్, మహేంద్ర, రంగస్వామి, రఘు పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** వెలిసిన శ్రీకాళికాదేవి ఆలయంలో నవరాత్రి పూజ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున శ్రీకాళికాదేవి బాల త్రిపుర సుందరి దేవిగా పూజలందుకున్నారు. విశ్వబ్రాహ్మణ శరవయ్య ఆచారి లక్ష్మి అమ్మవారికి జలాభిషేకం, వస్త్రాభరణం, కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు.

వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా రంగారెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలం బి.అగ్రహారం సర్పంచి రంగారెడ్డి వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ నుంచి ధ్రువపత్రం అందుకున్నారు. 30 రోజుల శిక్షణలో భాగంగా 28 రోజులు ఆన్‌లైన్, రెండు రోజులు ఆఫ్‌లైన్‌లో విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఈనెల 1న గ్రాండ్ సికింద్రాబాద్ హోటల్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ గంప నాగేశ్వరరావు, కోఆర్డినేటర్ రామచంద్రుడు, మాధురి మెంటర్ మహేంద్ర చేతులమీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఉద్యోగులు విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లోని వారికి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించి ఆత్మస్థైర్యం నింపేలా క్లాసులు బోధించనున్నట్లు తెలిపారు.


ధ్రువపత్రం అందుకుంటున్న రంగారెడ్డి

ఈరన్న స్వామి సన్నిధిలో రచ్చ రవి

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంలో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో 'జబర్దస్త్ రచ్చ రవి' పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఆయన పుణ్యక్షేత్రానికి రావడంతో ఆయనను చూడడానికి అక్కడున్న యువత, భక్తులు బరులు తీరారు. స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు.


రచ్చ రవితో ఫొటో దిగుతున్న భక్తులు

రాజగోపురం నిర్మాణానికి విరాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి రాజగోపురం నిర్మాణానికి కర్ణాటకలోని సిరుగుప్ప పట్టడానికి చెందిన శేఖర్ దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. దాతల పేరిట ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి పూజలు నిర్వహించారు.

పిసిసి అధ్యక్షునిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు : కాంగ్రెస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజును విమర్శించే స్థాయి సత్యనారాయణ గుప్తకు లేదని, అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పట్టే అర్హత కూడా లేదని ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎవరికీ తెలియని వారు పిసిసి అధ్యక్షుని విమర్శించడం సరికాదన్నారు. అధిష్టానం నిర్ణయాన్ని ప్రతి కార్యకర్త పాటించాలని, క్రమశిక్షణతో పని చేయాలని తెలిపారు. ఇలా తప్పుడు ప్రెస్ మీట్‌లు పెట్టి జిల్లా కాంగ్రెస్ పార్టీ పేరును దిగజారేలా చేయవద్దని హెచ్చరించారు. సత్యనారాయణ గుప్తపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంతవరకు ఎన్నడూ జరగని ఆదోని డివిజన్ పరిధిలోని వ్యక్తికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ నిర్ణయాన్ని తప్పు పడుతూ దళిత నాయకుని కించపరిచే విధంగా మాట్లాడడం తప్పని, ఈ పరిణామాన్ని కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదోని పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షులు దిలీప్ దోక, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఆదోని యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, కాంగ్రెస్ కార్యదర్శి సాయినాథ్, యువ నాయకులు శ్రీనిత్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు

- నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నేషనల్ విద్యాసంస్థల అధినేత జి.గోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆదోనిలోని నేషనల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... క్రీడా కోటాలో విద్యా, ఉద్యోగావకాశాలు పొందిన వారు ఉన్నారన్నారు. త్రోబాల్ అండర్-14 విభాగంలో నిహారిక, సపక్ తక్రా కౌశల్, టెన్నికాయిట్ ఫర్హాన్, అండర్-17 విభాగం క్రికెట్‌లో వై.సుష్మ, కబడ్డీ నూర్ బాష, టెన్నికాయిట్ సాహిత్యను, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు రవి, గోవిందు, సుమ, వెంకటేశ్వర్లును అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, సత్యాశ్రీ, కో ఆర్డినేటర్ షేక్షావలీ, అధ్యాపకులు కిషోర్, కంప్యూటర్ అధ్యాపకులు విజయ్ కుమార్, శివరాజ్ పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న గోపాల్‌రెడ్డి



పోస్టింగ్ ఇచ్చారు.. జీతం మరిచారు..

- రెండవ ఎంఇఒలకు అందని జీతాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

విద్యా వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం రెండో ఎంఇఒలను ఆర్భాటంగా ప్రభుత్వం నియమించింది. కానీ వారికి జీతాలు ఇవ్వడం మాత్రం పూర్తిగా మరిచారు. గడిచిన నాలుగు నెలలుగా జీతాలందక ఎంఇఒ-2 ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

విద్యావ్యవస్థ మార్పులో భాగంగా ప్రతీ మండలానికి రెండో ఎంఇఒను ప్రభుత్వం నియమించింది. మండలాల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఈ పోస్టుల్లో నియమించింది. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఇఒలకు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించగా, నియమించిన ఎంఇఒ-2లకు అకాడమిక్ బాధ్యతలు అప్పగించారు. స్కూళ్లకు సంబంధించి అకాడమిక్ మోనటరింగ్, ఉపాధ్యాయులకు శిక్షణాతరగతులు వంటి పనులను రెండో ఎంఇఒలు చూస్తున్నారు. ఇక్కడ వరకూ భాగానే ఉంది. పోస్టులో చేరిన వీరికి ఇప్పటి వరకూ ప్రభుత్వం జీతాలివ్వలేదు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మండలానికి ఒకరు చొప్పున రెండో ఎంఇఒలు పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 19వ తేదీన వీరంతా బాధ్యతలు చేపట్టారు. దాదాపు నాలుగు నెలలు గడిచి పోయింది. ఇప్పటి వరకూ జీతాలు అనేవి ఇవ్వలేదు. వీరంతా సీనియర్ ప్రధానోపాధ్యాయులే. నెలకు రూ.లక్ష, ఆపైన వరకూ జీతాలు అందుకుంటున్నవారే. నాలుగు నెలలుగా జీతాలందకపోవడంతో ఒక్కొక్కరికి దాదాపు రూ.నాలుగు లక్షలపైనే జీతం పెండింగ్‌లో ఉంది. ఈ జీతాలపై ఆధారపడి జీవించే కుటుంబాలకు నాలుగు నెలలుగా జీతాలు లేకపోతే పరిస్థితి ఏమిటో వేరే చెప్పనక్కర్లేదు. ఒకటి, రెండు నెలలు అయితే ఏదోరకంగా సర్దుకుంటారు. ఏకంగా నాలుగు నెలలుగా జీతాల్లేకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తమకు వచ్చే జీతాల ఆధారంగా నెలవారీ ఖర్చులు, ఇఎంఐలు వంటివి ఏర్పాటు చేసుకుంటారు. నాలుగు నెలలుగా వేతనాలందకపోవడంతో ఖర్చులు సర్దుబాటు చేసుకోవడం కష్టతరంగా మారింది. కుటుంబ అవసరాలకోసం సైతం అప్పుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నెలలోనైనా జీతాలు ఇస్తారా అనేది ఇంకా స్పష్టత లేదు. డిఇఒ కార్యాలయంలో పనిచేసే ఎడిలకు డిడిఒ బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో చాలా మండలాలకు రెగ్యులర్ ఎంఇఒలు లేరు. వేరే మండలాల్లో పనిచేస్తున్న ఎంఇఒలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు తమ మండలంతో పాటు వేరే మండలంలోని బాధ్యతలు నిర్వహించడం కష్టంగా మారింది. రెగ్యులర్ ఎంఇఒలు లేని మండలాల్లో రెండో ఎంఇఒగా నియమితులైన ఉద్యోగులకు పనిభారం సైతం ఎక్కువగానే ఉంటుంది. అకాడమిక్‌కు సంబంధించిన ఇబ్బందుల పరిష్కారంలో ఎంఇఒ-2 ఉద్యోగులు పనితీరు భాగానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ ఎంఇఒ-2 ఉద్యోగులకు నాలుగునెలలుగా జీతాలు ఇవ్వక పోవడం మాత్రం విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ నెలలో కూడా జీతాలు అందకపోతే ఉద్యోగులు ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

- సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి

- జిల్లా వ్యాప్తంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల

'కలలు కనండి వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం కషి చేయండి' అంటూ విద్యార్థులను ఉత్సాహపరిచిన భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి కవులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 'స్ఫూర్తిదాయకం-డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం' అంశంపై చర్చ నిర్వహించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సాహితీ స్రవంతి ద్వారా సాహిత్య కార్యక్రమాలను విస్తతం చేయనున్నట్లు తెలిపారు. మహానంది ఎంఇఒ రామసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు నిరంతరం ఉత్తేజకరమైన సూచనలు, సలహాలు ఇస్తూ మార్గదర్శకంగా నిలిచిన అబ్దుల్ కలాం జన్మదినం ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అనేక రచనల ద్వారా విద్యార్థులను, యువతను విజ్ఞాన పథం (మిగతా 6వ పేజీలో...)



ఉపాధ్యాయుడు మరియాదాస్‌ను సన్మానిస్తున్న సాహితీ స్రవంతి నాయకులు, సభ్యులు

శ్రీశైలంలో దసరా మహోత్సవాలు ప్రారంభం

- శైలపుత్రి అలంకారంలో అమ్మవారు

- భృంగి వాహన సేవలో స్వామి అమ్మవార్లు

ప్రజాశక్తి - శ్రీశైలం


శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు ఆదివారం సాంప్రదాయ పద్ధతిలో ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా ముందుగా శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణి రెడ్డి దంపతులు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు దంపతులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు అమ్మవారి యాగశాలలో ప్రవేశం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులకు దీక్ష వస్త్రములు అందజేశారు. ఆ తరువాత స్వామివారి యాగశాలలో ప్రవేశం చేసి అర్చనలు నిర్వహించారు.

- శైలపుత్రి అలంకారంలో అమ్మవారు - భృంగి వాహన సేవలో స్వామి అమ్మవార్లు

శ్రీశైలంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో నవదుర్గ అలంకరణలలో మొదటి రోజు ఆదివారం అలకార మండపంలో శైలపుత్రి అలంకారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భృంగివాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శైలపుత్రి అలంకారంలో ఉన్న అమ్మవారిని, భృంగివాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను ఆలయ ప్రధాన ద్వారం గుండా పురవీధుల్లోకి ప్రవేశింపజేసి వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, కళాకారుల కోలాటం, వేద మంత్రాల మధ్య గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా లోకకల్యాణం కోసం స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, అమ్మవారికి జపాలు, పారాయణలు, రుద్రయాగం, చండీయాగం వంటి పూజలు నిర్వహించారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న చైర్మన్, ఇఒ దంపతులు



శైలపుత్రి అలంకారంలో అమ్మవారు



భృంగి వాహనంపై కొలువైన స్వామి అమ్మవార్లు

నాణ్యతకు ప్రాధాన్యత

- నియోజకవర్గానికి ఐదు రోడ్లు మంజూరు

- ప్రజాశక్తితో ఆర్ అండ్ బి ఎస్ఇ ఆర్.నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రోడ్లు మరియు భవనాలు నిర్మాణంలో నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చే విధంగా కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేస్తానని రోడ్లు భవనాల శాఖ ఎస్ఇ. ఆర్ నాగరాజు అన్నారు. నియోజకవర్గానికి ఐదు హై ప్రియారిటీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రయాణం రవాణా సక్రమంగా జరగాలంటే రోడ్లు ముఖ్యంగా ప్రాధాన్యత సంతరించుకుంటామని, ప్రభుత్వ కార్యకలాపాలు సక్రమంగా జరగాలంటే ప్రభుత్వ కార్యాలయ భవనాలు మంచిగా ఉండాలని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...



ఉభయ జిల్లాల్లో 2022 -23 సంవత్సరానికి కొత్త పనులు ఎన్ని వచ్చాయి..?

ఎస్ఇ: 2022- 23 సంవత్సరానికి ఉభయ జిల్లాల్లో ప్రైమరీ హెల్త్ సెంటర్ లు 13 భవనాల నిర్మాణానికి 30 కోట్లు మంజూరయ్యాయి. (నంద్యాలకు నాలుగు, కర్నూలుకు 9). అలాగే 50 లక్షలతో ఐదు బ్లాక్ పబ్లిక్ యూనిట్లు వచ్చాయి.

భవనాల మరమ్మత్తులకు ఏమైనా నిధులు వచ్చాయా..?

ఎస్ఇ : కర్నూల్లో కలెక్టరేట్ భవనం మరమ్మత్తుల కోసం రూ.8 కోట్లు మంజూరు అయ్యాయి. పనులు జరుగుతున్నాయి.

హై ప్రియారిటీ రోడ్స్‌కు ఎన్ని నిధులు మంజూరు అయ్యాయి..?

ఎస్ఇ : హై ప్రియారిటీ రోడ్స్ నియోజకవర్గానికి ఐదు రోడ్లు చొప్పున 25 ప్యాకేజెస్‌కు దాదాపు రూ.70 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మున్సిపాలిటీలలో ఉంటాయి. ఇందులో ప్రధానంగా పాణ్యంకు మూడు, కోడుమూరు రెండు, నందికొట్కూరు రెండు, మంత్రాలయం మూడు, నంద్యాల రెండు, ఎమ్మిగనూరు ఒకటి, ఆదోని మూడు, శ్రీశైలం ఒకటి, పత్తికొండ మూడు, ఆలూరు ఒకటి, ఆళ్లగడ్డ రెండు, బనగానపల్లె ఒకటి, డోన్ ఒకటి ఉన్నాయి.

కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా కలెక్టరేట్ నిర్మాణానికి భవనం ఏమైనా మంజూరు అయిందా..?

ఎస్ఇ : నంద్యాల కలెక్టరేట్ నిర్మాణం కోసం వ్యవసాయ పరిశోధన కేంద్రానికి సంబంధించిన పది ఎకరాల స్థలం సర్వేలో ఉంది. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయితే భవన నిర్మాణం చేపడతాం.

పుష్కరాలకు సంబంధించి మిగిలి ఉన్న నిధులతో ఏమైనా రోడ్లు వేస్తున్నారా..?

ఎస్ఇ : పుష్కరాలకు సంబంధించి న మిగిలి ఉన్న నిధులతో రేమట. ఉల్చల రోడ్లు పూర్తిగా పాడవడంతో రేమటకు రూ.రెండు కోట్లు, ఉల్చాలకు రూ.నాలుగు కోట్ల కేటాయించి పనులు ప్రారంభించాం.

కర్నూలులో వక్కెర బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. నిర్మాణానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా..?

ఎస్ఇ : వక్కెరవాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.8 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాము. నిధులు వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం.

గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు చర్యలు ఏమైనా తీసుకున్నారా..?

ఎస్ఇ : గ్రామీణ ప్రాంతాలలో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్న విషయం వాస్తవమే. అయితే ఎక్కడ ఎక్కువ అవసరమో అక్కడ ప్రాధాన్యతను బట్టి రోడ్లను నిధులు రాగానే వేయడం జరుగుతుంది.

చేసే పనులలో నాణ్యత లేకుంటే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : చేసే పనుల్లో నాణ్యత లేకుంటే క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ విజయవాడ వారు వచ్చి రోడ్లను పరిశీలించడం జరుగుతుంది. రోడ్లలో నాణ్యత లేకుంటే రికవరీ పెడతారు. బిల్లులు ఆపేయడం జరుగుతుంది.



జిల్లాకు మరో 1748 మెట్రిక్ టన్నుల యూరియా

- జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాకు అదనంగా మరో 1748.385 మెట్రిక్ టన్నుల యూరియా వ్యాగన్ వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు తెలిపారు. ఆదివారం నంద్యాల రేక్ పాయింట్ వద్ద కంపెనీ వారు సమర్పించిన ముందస్తు ఎరువుల పంపిణీ ప్రణాళికలో పొందుపరచిన డీలర్లకు సరిగా వెళుతున్నాయా లేదా అని మండల వ్యవసాయ అధికారి ఇ.ప్రసాద రావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన ఎరువుల వ్యాగన్‌లో 1748.385 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు 50 శాతం యూరియా 900 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు కేటాయించినట్లు చెప్పారు. మరో 837.90 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు కేటాయించామని తెలిపారు. జిల్లాలో రబీ పంట కాలం ప్రారంభం కావడంతో రైతులు ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా 10546.29 మెట్రిక్ టన్నులు, డిఎపి 7906 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 4716 మెట్రిక్ టన్నులు, ఎన్‌పికె కాంప్లెక్స్‌లు 21720 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 1072 మెట్రిక్ టన్నులు ఎరువులు ప్రైవేట్ డీలర్లు దగ్గర, రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌సిఎల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్, కంపెనీ హ్యాండ్లింగ్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల రేకు పాయింట్‌లో ఎరువుల స్టాక్ ను పరిశీలిస్తున్న డిఎఒ



గోగిశెట్టి నరసింహారావును సన్మానిస్తున్న నాయకులు

హైకోర్టు న్యాయవాదికి సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : శిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె గ్రామంలో హైకోర్టు న్యాయవాది, టిడిపి నాయకులు డాక్టర్ గోగిశెట్టి నరసింహారావును ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గూడూరు సంజీవ రాయుడు, ఆళ్లగడ్డ మాజీ జెడ్పిటిసి చాంద్ బాష, ఎస్ఎల్ రమణ, మాజీ ఎంపిటిసిలు గంగాధర్, కొమ్మి చిన్న ఆంజనేయులు తదితరులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోగిశెట్టి నరసింహారావు రాజకీయాల్లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ప్రజా సేవలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. న్యాయవాదిగా ఆయన ఎన్నో సమస్యలు పరిష్కరించి ఎంతో మంది బాధితులకు న్యాయం చేశారని చెప్పారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయనకు టిడిపిలో సముచిత స్థానం కల్పించి, సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కోటకొండ మాజీ సర్పంచి పాములేటి, పెద్ద కంబలూరు మాజీ ఎంపీటీసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వారికి వెండి వడ్డానం విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని టంగుటూరు పెద్దమ్మ అమ్మ వారికి అదే గ్రామానికి చెందిన దాసి చంద్రశేఖర్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీదేవి, కూతుర్లు మాధవి, లావణ్య, కుమారుడు మహేశ్వర రెడ్డిలు వెండి వడ్డానం విరాళంగా ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

టిడిపి నాయకునికి బిసి రాజా రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని కరీంబాగ్‌కు చెందిన టిడిపి నాయకులు సుబ్బరాయుడును బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఆదివారం పరామర్శించారు. సుబ్బరాయుడు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బిసి రాజా రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.



సుబ్బరాయుడును పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాల మీదనే కాకుండా అభివృద్ధి పనుల మీద కూడా దృష్టి కేంద్రీకరించి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లింగాల గ్రామంలో 32 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన డ్రైన్‌లు, సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచి డివి. శేషిరెడ్డి, వైసిపి నాయకులు ఎరువ శేషిరెడ్డి, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు 3 కోట్ల రూపాయలతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు కర్రా హర్షవర్ధన్ రెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, కోయిలకుంట్ల మండలం సచివాలయ కన్వీనర్ లాయర్ మధుసూదన్ రెడ్డి, లింగాల గ్రామ సర్పంచ్ డివి శేషరెడ్డి, ఎరువ శేషి రెడ్డి, శీలా రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంపుల్లారెడ్డి, బాల వెంకటరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ఎల్‌వి సుధాకర్ రెడ్డి, శ్రీనివాస నాయక్, భీమిరెడ్డి ప్రతాపరెడ్డి, ఎల్ఐసి రామసుబ్బారెడ్డి, గుంజలపాడు రామసుబ్బారెడ్డి, రేవనూరు హరినాథ్ రెడ్డి, చిక్కేపల్లి ప్రసాద్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కెవికె శాస్త్రవేత్తకు రైతు నేస్తం అవార్డు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగ శాస్త్రవేత్త యం.సుధాకర్‌కు రైతు సేవలో వారు చేసిన కృషికి గుర్తింపుగా రైతు నేస్తం అవార్డు లభించింది. రైతు నేస్తం అవార్డును భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా అందుకున్నారు. ఆదివారం కృష్ణాజిల్లా గన్నవరం దగ్గర ఆత్మకూరులో భారత్ ట్రస్ట్ రైతు నేస్తం 19వ వార్షికోత్సవంను ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి జీవితాంతం సేవలందించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మశ్రీ డా. ఐ.వి. సుబ్బారావు పేరిట రైతు నేస్తం పురస్కారాలు వ్యవసాయ అనుబంధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలకు అందజేసి ఘనంగా సత్కరించింది. అవార్డు అందుకున్న శాస్త్రవేత్త సుధాకర్‌కు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు కెవి రమణయ్య, బాలరాజు, లక్ష్మీ ప్రియ, కృష్ణమూర్తిలతోపాటు ఇతర శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా రైతు నేస్తం అవార్డును అందుకుంటున్న శాస్త్రవేత్త సుధాకర్

సంక్షేమ పథకాలను విస్తృత ప్రచారం చేయాలి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యక్రమాలను సోషల్ మీడియా సభ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో టీం జగనన్న సోషల్ మీడియా ద్వారా ఇతర మాధ్యమాలలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతిభ కనబరిచిన సోషల్ మీడియా ప్రతినిధులకు ఐ ప్యాడ్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే ప్రదానం చేశారు. నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు మంది సోషల్ మీడియా సభ్యులకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని కూడా ప్రజల్లోకి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా తీసుకువెళ్లి ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టడానికి సోషల్ మీడియా ప్రతినిధులు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఐ ప్యాడ్ ప్రతినిధి తక్షిన్, బనగానపల్లె నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సాదుల శివశంకర్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు జిల్లెళ్ళ శంకర్ రెడ్డి, అయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీం జగనన్న సోషల్ మీడియా సభ్యులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

టూరిస్ట్ రెస్టారెంట్ పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా చిన్న చెరువు కట్టపై చేపట్టిన టూరిస్ట్ రెస్టారెంట్, పార్క్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. గ్రీన్ కో ఆధ్వర్యంలో జరుగుతున్న టూరిస్ట్ రెస్టారెంట్, పార్క్ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పనులను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ప్రజల నంద్యాల పట్టణ ప్రజల ఆహ్లాదకర వాతావరణానికి మానసికల్లాసానికి ఈ ఎకో టూరిజం పార్క్ దోహదం చేస్తుందన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే





చేతుల శుభ్రతపై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చేతుల శుభ్రతతో రోగాలు దూరం : విఒఎ

ప్రజాశక్తి - రుద్రవరం

చేతుల శుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని విఒఎ సర్దార్ భాష తెలిపారు. ఆదివారం మండలంలోని చిలకలూరు గ్రామంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచి ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. విఒఎ సర్దార్ భాష అధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీలలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యక్తిగత శుభ్రత వల్ల ఆరోగ్య భద్రత లభిస్తుందని పొదుపు మహిళలకు సూచించారు. పలు రకాల పద్ధతులలో చేతులను ఏ విధంగా శుభ్రపరచుకోవాలో మహిళలకు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కృత్రిమ వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు, పొదుపు సంఘం లీడర్లు పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం : దసరా పండగను పురస్కరించుకుని శ్రీశైలంలో జరుగుతున్న ఉత్సవాలలో సామాన్య భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. ఆదివారం ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నేటి నుండి 24వ తేది వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే దసరా నవరాత్రులలో స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. స్వామి అమ్మవార్లని దర్శించుకునేందుకు ప్రత్యేకంగా ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక పోలీసుల సహకారంతో ట్రాఫిక్ జామ్ కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పరిపాలన భవన సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు కేటాయించినట్లు చెప్పారు. క్యూ లైన్లలో భక్తులకు మంచి నీరు, అల్పాహారం, పాలు అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల నాని

సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తన బాధ్యత అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం చాగలమర్రిలోని నారాయణ పల్లె రస్తాలోని జగనన్న లేఔట్లలో సయ్యద్ లాలా మియా నిర్మించుకున్న నూతన గృహాన్ని, మన్సూర్ వాటర్ ఏజెన్సీని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నేతలకు ఎలక్షన్ల ముందు అన్ని గుర్తొస్తాయని తరువాత వాటిని పట్టించుకోరని అన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఏపీ టి సిసిఏ రాష్ట్ర అధ్యక్షుడు షరీఫ్ ఖాన్, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కో ఆప్షన్ సభ్యులు జిగ్గీ గారు ఇబ్రహీం, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీటీసీలు ఫయాజ్, లక్ష్మిరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేష రమేష్, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్లా భాష, వైసిపి నాయకులు వెంకటరమణ, చక్రం బీడీ షబ్బీర్, ముల్లా ఖాదర్బాషా, అబ్దుల్లా, పెయింటర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి



మృతి చెందిన హరిఓబులేసు

మండలంలోని గొడెగనూరు గ్రామానికి చెందిన హరిఓబులేసు (24) అనే యువకుడు పాముకాటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓబులేసు, పెద్ద వీరమ్మ దంపతుల కుమారుడైన హరిఓబులేసు తన సొంత పొలానికి నీరుకడుతుండగా పాము కాటుకు గురై తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. కుటుంబీకులు వెంటనే కేరళ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వైద్యశాలకు వెళ్లి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వికలాంగులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గడివేముల

మండల కేంద్రమైన గడివేములలో దసరా పండు గను పురస్కరిం చుకొని ఆదివారం నాడు బొంతల సుబ్బరాయుడు సేవాసమితి ఆధ్వర్యంలో కీర్తిశేషులు బొంతల సుబ్బరాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు బొంతల ప్రసాద్, బొంతల సుధాకర్, బొంతల మధుసూదన్ గుప్తా ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి నాయకులు మాజీ ఎంపీటీసీ దేశం సంజీవరెడ్డి పాల్గొని ఆయన చేతుల మీదుగా దాదాపు 50 మంది వికలాంగులకు పదివేల రూపాయలు విలువచేసే దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎంపిటిసి సంజీవరెడ్డి మాట్లాడుతూ బొంతల సుబ్బరాయుడు సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వికలాంగుల దుస్తులు పంపిణీ కాకుండా వేసవి కాలంలో చలివేంద్రమును, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటుచేసి పేద వారికి ఉపాధి కల్పించడానికి పలు సహాయ, సహకారాలు అందిస్తు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న దూదేకుల నూర్‌భాష సోదరులు

చలో గుంటూరు జయప్రదం చేయండి

- ఎపి దూదేకుల నూర్ బాష్ సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈనెల 29న గుంటూరులో దూదేకుల సింహగర్జనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ దూదేకుల నూర్ బాష్ సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి హుసేనప్ప, జిల్లా కార్యదర్శి దస్తగిరి, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు దూదేకుల క్రాంతి కోరారు. ఆదివారం చాగలమర్రి పట్టణంలోని దూదేకుల నూర్బాష్ సంఘ సభ్యులతో చలో గుంటూరు గోడపత్రికలను ఆవిష్కరిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు నూర్బాష దూదేకుల సభ్యులకు చట్ట సభలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మైనార్టి పదవులలో వర్గీకరణ, దామాషా ప్రకారం దూదేకులకు బడ్జెట్ కేటాయించాలని డిమా ండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ అధ్యక్షులు దస్తగిరి, చాగ లమర్రి దూదేకుల నూర్ బాష్ సంఘ సభ్యులు చిన్నపీరయ్య, బ్రహ్మయ్య, లాలయ్య, దస్తగిరి, డీఎం బాషా, రంగయ్య, ఇమామ్లు, నాగశేషు, పెద్దపీరయ్య, మస్తాన్, బాబయ్య, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో యోగీశ్వర తిక్కస్వామి 44వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అనంతరం యోగేశ్వర స్వామి చిత్రపటాన్ని గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు గ్రామ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించే పదవ రాష్ట్ర స్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కర్నూలు జిల్లా సాఫ్ట్బాల్ కార్యదర్శి విజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆదివారం మాట్లాడుతూ ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీలలో పాల్గొనే బాలురకు, బాలికలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, ప్రతాప్, దేవేంద్ర, నరసింహ, సుబ్బారాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో న్యాయానికి సంకెళ్లు: బిసి



సంకెళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి న్యాయానికి సంకెళ్లు వేసి అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చేతులకు సంకెళ్ళు వేసుకుని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల్ని చుట్టం చేసుకొని, వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ, న్యాయానికి సంకెళ్లు వేసిన సైకో జగన్ రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను అక్రమ కేసులో ఇరికించి జైలుకు పంపుతున్నారని అన్నారు. జైల్లో చంద్రబాబు ఆరోగ్యం సక్రమంగా లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం బాగున్నట్లు జైళ్ల శాఖ అధికారులతో ప్రకటింపజేయడం దారుణమన్నారు. చంద్రబాబుకు ఏమైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాధ్యత వహించాల్సిఉంటుందన్నారు. చంద్రబాబు విడుదల అయ్యేంతవరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, తెలుగు యువత నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, పట్టణ అధ్యక్షులు కాసింబాబు, నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, అన్వర్ సాహెబ్, లాయర్ నాగేంద్ర రెడ్డి, ఖాదర్ బాషా, టిప్ టాప్ కలాం, షేక్షావలి, బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి, హమ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల:** టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయని టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్ జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో 'బాబుతో నేను సైతం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడారు. టిడిపి ప్రజా ఆదరణ అధికంగా లభిం చడంతో వచ్చే ఎన్నికల్లో ఓటమిభయుద్ధం వైసిపి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని మండిపడ్డారు. అనంతరం నవరాత్రులను పురస్కరించుకుని



నెహ్రూ నగర్ లో బాబుతో నేను సైతం కార్యక్రమంలో మాండ్ర శివానందరెడ్డి, నాయకులు



చేతులకు తాళ్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న టిడిపి

గ్రామములో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న మాజీ ఎంపిటిసి నాగలక్ష్మమ్మ, రామ మద్దిలేటి, రామకృష్ణ, రంగస్వామి, రాముడు, శేషన్న, అంజి, శ్రీను, జమ్ములయ్య, శ్రీరంగడు, మహేష్, శివ మరి కొంతమంది మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గ్రామంలో అల్లపాటి రామిరెడ్డి కుటుంబ సభ్యులైన ఆయన సతీమణి సుభాషిని, కుమారుడు హుస్సేన్ రెడ్డి, పద్మావతామ్మ, ప్రమీలమ్మ, కుటుంబ సభ్యులను కలిసి తేనేటి విందు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకుడు సురేంద్ర నాథ్ రెడ్డి, బండి జయరాజ్, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, లోకానంద రెడ్డి, జయ సూర్య, జనార్ధన్ నాయుడు, కడియం వెంకటేశ్వర యాదవ్, కాత రమేష్ రెడ్డి, ముత్తు జావలి, నాపరెడ్డి, జమీల్, నాగరాజు, శేఖర్, మద్దిలేటి, రసూల్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **సంజామల :** మండలంలోని కమలాపూర్ గ్రామంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా 'బాబుతో నేను' కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బాబును అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బాష కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే

- టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష

చాగలమర్రి : టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆరోగ్య బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష అన్నారు. ఆదివారం స్థానిక రిక్వెస్ట్ స్టాప్ వద్ద టిడిపి నాయకులు కార్యకర్తలు, భూమా అభిమానులు తమ చేతులకు తాళ్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ న్యాయానికి సంకెళ్ల కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్యాలెస్‌లోని పిచ్చి జగన్ కుట్రలు దేశానికి చాటేలా ఐదు కోట్ల ఆంధ్రులు ఒక్కటిగా చంద్రబాబుకు సంఘీ భావం తెలిపామన్నారు. చంద్రబాబు ధర్మ పోరాటానికి మద్దతుగా పోరాటాలకు సిద్ధమన్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, సల్ల నాగరాజు, గుత్తి నరసింహులు, మౌలాలి, క్లస్టర్ ఇంచార్జి అజిముద్దీన్, ప్రచార కార్యదర్శి గఫార్, ప్రధాన కార్యదర్శి హనీఫ్, బీసీ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, బషీర్ ,వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, ఓబులేసు శంకర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచర్ల పట్టణం, ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో టిడిపి నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బేతంచెర్ల మండల కన్వీనర్ వున్నం ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి ,మండల గౌరవ నాయకులు రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పరిపాలన రాజ్యమేలుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేష్ చౌదరి జాకిర్ల బేగ్ మాజీ ఎంపీటీసీ, జవ్వాజి వెంకటేశ్వర్లు, సుధాకర్ చౌదరి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, నాగేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ రామాంజనేయులు, రాంగోపాల్, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, నంద్యాల పార్లమెంట్ ఎస్సీ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, ఎస్సీ సెల్ యూత్ ప్రెసిడెంట్ సుమంత్, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ,బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, తిమ్మరాజు నంద్యాల మధు టైలర్ రాముడు శ్రీధర్ లక్ష్మన్న వెంకటేశ్వర గౌడ్ పూల మద్దిలేటి ,నాగేశ్వరరావు, భీమారెడ్డి, రామకృష్ణ మద్దిలేటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

5వ పేజీ తరువాయి... వైపు నడిపించిన కలాం స్ఫూర్తితో సాహితీవేత్తలు మంచి రచనలతో సమాజాన్ని ప్రగతి వైపు నడపాలని కోరారు. సాహితీ స్రవంతి కార్యదర్శి మాదాల శ్రీనివాసులు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపించడానికి అందరూ కృషి చేసినప్పుడే కలాం ఆశయాలు నెరవేరుతాయన్నారు. కవులు నరేంద్ర, కొప్పుల ప్రసాద్ నీలకంఠమాచారి, మాబు బాషా, నీలం వెంకటేశ్వర్లు, రఫి తదితరులు విద్యార్థి దినోత్సవం సందర్భంగా కవితలు వినిపించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ నుండి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా ప్రమోషన్ పొందిన మరియదాస్‌ను సాహితీ స్రవంతి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీధర్, భాషోపాధ్యాయ సంస్థ కార్యదర్శి కన్నయ్య, ఎన్జీవో సంఘమ అధ్యక్షుడు మణి శేఖర్ రెడ్డి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూత్రాలు ప్రపంచానికి ఆదర్శమని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక యూనివర్సిటీకి గానీ, ఒక జిల్లాకు గానీ ఆయన పేరు పెట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాల హనుమంతు, భాస్కర్, పుల్లయ్య, రసూల్ భాష తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** భారత రత్న అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఆపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ బాష ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, మునికుమార్, నరసింహ తధితరులు పాల్గొన్నారు. **రైతు సంఘం ఆధ్వర్యంలో .. ఆత్మకూర్:** ఆత్మకూరు పట్టణంలోని స్థానిక రైతు సంఘం కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మోమిన్ మునీర్ బాష, ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్రం ఛైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా, వైకాపా నాయకులు, ది ఆత్మకూరు ఖబరస్తాన్ అండ్ వేల్ఫేర్ కమిటి ప్రెసిడెంట్ మోమిన్ ఇబ్రాహీం ఖలీలుల్లా, వైస్ ప్రెసిడెంట్ నాయబ్ సయ్యద్ అసదుల్లా, ట్రెజరల్ యం.డి.షరీఫ్, సభ్యులు టైగర్ బాబు, బైరాపురం రహంతుల్లా



ఆత్మకూరు : అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

(గౌండ), షేక్.షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** స్థానిక పాత బస్టాండ్ కాలనీలోని అజీమ్ బ్రిలియంట్ హైస్కూల్ నందు కరస్పాండెంట్ ఎంఎస్ అన్సర్ బాష ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంఎస్ అన్సర్ బాష మాట్లాడుతూ భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత సాధించిన వ్యక్తి కలాం అన్నారు. దేశ భవిష్యత్తు కోసం నిత్యం కలలు కని, ఆ కలలు సాకారం కోసం కృషి చేసేవారని, ప్రతి ఒక్కరూ కలాంను ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబర్ 17 నుండి మహిళా సమాఖ్య మహాసభ

ప్రజాశక్తి - బనగానపల్లె

నంద్యాల పట్టణంలో నవంబర్ 17, 18, 19వ తేదీలలో జరగబోయే ఎపి మహిళా సమైక్య 15వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఎపి మహిళా సమైక్య 15వ రాష్ట్ర మహాసభల కరపత్రంలను సిపిఐ నాయకులు విడుదల చేశారు.

కులగణనపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

కులగణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెల్లడించాలని సమాజ్‌వాది పార్టీ నాయకులు పాండురంగ యాదవ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో బిసి సంఘం నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు కురుబ తిరుపాల్, పవన్ కుమార్, మైనార్టీ నాయకులు నాసిర్ పాల్గొన్నారు.

జడ్పి పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - గడివేముల

మండల కేంద్రమైన గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 2003-04 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. వారి



పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

గురువులను శివారెడ్డి, షంషేర్ మియా, జయమ్మ, దర్గయ్య, చంద్రశేఖర్, సోమశేఖర్, ఆనంద్, చెన్నప్ప, కాజా, మహమ్మద్ అలీ గురువులను పూర్వ విద్యార్థులు పూలమాలశాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మమ్మల్ని గుర్తించి సన్మానం చేయటం మర్చిపోలేము అని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు మౌలాలి, చాంద్ బాషా, కిరణ్, పెద్దన్న, సత్యనారాయణ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో 99 టీవి ఛానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్న మధు కుటుంబానికి ఏపీయూడబ్ల్యూజే అసోసియేషన్ నాయకులు, సభ్యులు అండగా నిలిచారు. నెల రోజుల క్రితం డోన్ పట్టణంలోని తారకరామనగర్‌లో మధు బైక్ మీద వెళుతుండగా అతి వేగంగా కారు వచ్చి ఢీ కొన్న ప్రమాదంలో కాలు విరగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. కర్నూల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం తన స్వగ్రామమైన కటారికొండలో మధు ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న ఏపీయూడబ్ల్యూజే డోన్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఆదివారం కటారి కొండకు వెళ్లి మధు కుటుంబానికి రూ. 75500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే అసోసియేషన్ సీనియర్ నాయకులు రమణ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపదలో ఉన్న జర్నలిస్ట్ మధు కుటుంబానికి సహచర జర్నలిస్టులు అండగా నిలవడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అసోసియేషన్ డోన్ నాయకులు అనార్,గోపికృష్ణ,ఖాదర్ బాషా, సుధాకర్, రవి,గణేష్, మురళి,తారక్,శేఖర్ రెడ్డి,నాగరాజు, పారిశ్రామికవేత్త బొబ్బల శివ రామిరెడ్డి, చోళ ఇన్సూరెన్స్



మధుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న డోన్ జర్నలిస్టులు

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు చౌడేశ్వరి దేవి శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులను కల్పించారు. **అవుకు :** అవుకు పట్టణంలోనివాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆర్యవైశ్యులు ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు తాలేపల్లె నాగేంద్ర కుమార్, శ్రీనివాసులు, శివ, సురేంద్ర, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** బనగానపల్లె కొండపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరణవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కన్యకా పరమేశ్వరి శ్రీ స్వర్ణ కవచాలాంకృత దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గాదంశెట్టి వేణుగోపాల్, సెక్రటరీ శ్రీరామ సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, గౌరవ



ఆళ్లగడ్డ : రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

సలహాదారులు గాదంశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లగట్ల శివయ్య, సెక్రటరీ గుండా రవికుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి శాలలో కలశ స్థాపన కార్యక్రమం చేశారు. రాత్రి వాసవి మాత శ్రీ రాజరాజేశ్వరి దేవి అలకంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని విశ్వరూప కాలనీలో ఉన్న కాళికామాత ఆలయంలో నవరాత్రులు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దురుగడ్డ రవీంద్రాచారి ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. **కొత్తపల్లి :**



అవుకు : అమ్మవారికి కలిశాలను తీసుకొస్తున్న ఆర్యవైశ్య మహిళలు

మండలంలోని సప్త నది సంగమ తీరంలో కృష్ణా తీరంలో ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో దేవి నవరాత్రులలో భాగంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లలితా దేవి అమ్మవారు త్రిపుర సుందరీ దేవికి శైల పుత్రి అవతారంలో బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని, లలితా సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. **గడివేముల:** మండల కేంద్రమైన గడివేముల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు శరన్నవరాత్రి ఉత్సవాలను ఆర్యవైశ్య సోదరుల ఆధ్వర్యంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొంతల మధుసూదన గుప్తా పథకావిష్కరణతో అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించారు. మంగళహారతి కార్యక్రమంను అర్చకులు సత్య నారాయణశర్మ, వసంత లక్ష్మి నిర్వహించారు.



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో రూ.కోటి 70 లక్షలతో పాతపేట, పాత బస్టాండ్‌ల నందు నిర్మించిన డాక్టర్ వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం ప్రారంభిస్తారని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,కౌన్సిలర్లు మల్లికార్జున్ రెడ్డి,సాధిక్,డి.ఈ.రసూల్,ఏ.ఈ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిసిపి తరగతులను జిల్లా కోఆర్డినేటర్ తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలో ఆదివారం నాడు వివిధ పాఠశాలల్లో జరుగుతున్న పిసిపి క్లాసులను జిల్లా కోఆర్డినేటర్ పి లక్ష్మినారాయణ తనిఖీ చేశారు. స్కిల్ హబ్ సెంటర్‌ను విద్యార్థులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పి లక్ష్మినారాయణ మాట్లా డుతూ క్లాసులు షెడ్యూల్ ప్రకారము నిర్వహించాలని సూచిం చారు. ప్రతి విద్యార్థి అటెండ్ అయ్యే విధంగా చూడాలని పేర్కొ న్నారు. హాజరైన విద్యార్థులను ఆత్మకూరు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సహాయంతో స్కిల్ హబ్ సెంటర్‌ను విద్యార్థులను తీసుకువెళ్లి వారికి స్కిల్ హాబ్ సంబంధించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం స్కిల్ హబ్ నందు కోర్సు జరుగుతున్నందున నవంబర్ 10 నుంచి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు స్కిల్ హబ్ నందు స్కిల్ ట్రైనింగ్ ఇస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, మండల విద్యాశాఖ అధికారి జానకిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పగిడ్యాల

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని మండలంలోని ఆయా గ్రామాల స్వయం సంఘాలు ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ చేతులు శుభ్రపరచుకున్న దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించి చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి, మల విసర్జన చేసిన అనంతరం చేతులు శుభ్రం చేసుకుని వంటలు చేసుకోవాలని చేతులు ఎలా కడుక్కోవాలి సబ్బుతో కడిగి చూపించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల గ్రూపులు పాల్గొన్నాయి.

గుండెపోటుతో టిడిపి నేత నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల



మృతదేహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మండలంలోని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వరరావు ఆదివారం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ ఉన్నాం ఎల్ల నాగయ్య, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, గౌరవ సలహాదారుడు తిరుమలేశ్ చౌదరి, ఎండూరి మహేష్, ఉన్నం వెంకన్న, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు టైలర్ రాముడు, స్థానిక టిడిపి నాయకులు భౌతికకాయాని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య మాట్లాడుతూ టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వరరావు చంద్రబాబు నాయుడి అరెస్టు మనోవేదనతో మృతి చెందారని అన్నారు.



విజేతలకు కప్పు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

ఫ్రెండ్లీ క్రికెట్ విజేత ఆత్మకూరు జట్టు

ప్రజాశక్తి - వెలుగోడు

ఫ్రెండ్లీ క్రికెట్ ఆటలో ఆత్మకూరు జట్టు విజయం సాధించింది. ఆదివారం నాడు నంద్యాలలోని వెంకటేశ్వరపురం ఎస్‌డిఆర్ పాఠశాల ఆవరణలో ఆత్మకూరు నంద్యాల ఆళ్లగడ్డ బనగానపల్లి మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లకు నంద్యాల అపుస్ మా యూనిట్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లి క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణా రెడ్డి హాజరై విజేతలకు క్రికెట్ కప్పును అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడారు. క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. గెలుపు ఓటము లకు చోటు ఇవ్వకుండా ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. ఆత్మకూరు టీం ఫయాజ్ అలి ఖాన్, రమణారెడ్డి, తాజుద్దీన్, దర్గయ్య, నాగశేషులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న శేషారెడ్డి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల పట్టణంలోని శ్రీ శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 2005 -సంవత్సరము 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. తమ మిత్రులు లక్ష్మీ సురేష్, సోమశేఖర్లు గత కొన్ని నెలల క్రితం అనారోగ్య ంతో మరణించడంతో మిత్రుల కుటుంబ పరిస్థితులను తెలుసుకొని లక్ష్మీ సురేష్, సోమశేఖర్ల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ. 50,000 చొప్పున ఫిక్స్ డిపాజిట్ చెక్కులను హైస్కూల్ కరస్పాండెంట్, మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, హెడ్మాస్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.